# శృతి తప్పిన అహం - గతి తప్పిన ఆశ

— భమిడిపాటి అనంతశర్మ

ఆపసోపాలుపడుతూ, నేవుకుంటూ నడుం కట్టుతో వసంతలక్ష్మి ఇంట్లో అటూ యిటూ నడయాడుతూంటే బాబూరావు కంటికి మహా శోభగా వుంది పనిమనిషే అన్ని పన్లూ చేస్తున్నా-ఆవిడ అలిసిపోతుందేమోనని మిగిలిన పన్లకి తనే చెయ్యి చేసుకుంటున్నాడు. నెల పురుట్లో పిల్లాణ్ని ఎత్తుకోడం చేతకాదు. అలాగని ఆతృతని చంపుకోలేక ఎత్తుకోడం-ఆ బాలుడు బాబురావు మోటు చేతులకి ఒళ్ళు నొప్పులు చేసి ఏడవడమూ-వసంతలక్ష్మి వెంటనే—"అయ్యయ్యో! చేతాకాదు-వాతాకాదు. ఎందుకో చంటిపిల్లాణ్ని ఎత్తుకోడం" అని తను అందుకోబోయేలోగా బాబూరావు బట్టలు ఖరాబు అవ్వడమూ, కొంచెం అటూ యిటూగా రోజూ జరుగుతున్న వినోదాలు.

మెటర్నిటీహోంలో పురుడోసుకుని సదకొండో రోజున ఇంటికి వచ్చింది వసంత. వారం గడిచేటప్పటికి వాంతులూ విరోచనాలూ మొదలయ్యాయి పిల్లవాడికి. మొదట్లో తక్కువ అవ్వడంవల్ల చంటిపిల్లలకి యిది మామూలే అనుకున్నారు. కాని మూడో రోజు కూడా అదే పరిస్థితి అవ్వడంవల్ల డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళేరు. డాక్టరు పరీక్ష చేసేడు. "పిల్లవాడికి డబ్బా పాలు పడవు. కనీసం ఆరు నెలలయినా తల్లిపాలు కావాలి." డాక్టరు అప్పటికి మందిచ్చి ముందు జాగ్రత్త కోసం చేసిన హెచ్చరిక. బాబూరావు ముందు ఆశ్చర్యపడి తరువాత ఆందోళన పడ్డాడు. డాక్టరు సలహా ఆశ్చర్యపరిచింది. దానికి కారణమైన భార్య ప్రవర్తన ఆందోళన కలిగించింది.

వసంత కన్నతల్లి కదా! కొడుకు జాగ్రత్త బాధ్యత ఆమెకూ వుంది. కాని డాక్టరు చెప్పిన పరిష్కారం ఆమెకు యిష్టంలేదు. ఇష్టం అయితే



ఈ సమస్య యిలా పుట్టి వుండదు కదా!

రాత్రి బాగా పొద్దుపోయాక వసంత వచ్చి బాబూరావు మంచం మీద పక్కన కూర్చుంది. బాబూరావు మెలుకువగానే వున్నాడు. తల తిప్పి చూశాడు. తొలి కానుపు తర వాత ఆడదాని అందం రెట్టింపు



అవుతుందట. ఇప్పుడు చూస్తున్న వసంత మొదటిరాత్రి వసంతని గుర్తుచేస్తోంది. ఒక్కటే తేడా! ఆ రాత్రి మనిషి అంతా మల్లెల

వాసన-ఇప్పుడు పురిటి వాసన.

"ఏం చేద్దామండీ!" నెమ్మదిగా అడిగింది.

"దీనికి నేనేం చెయ్యను!"

"నన్నేం చెయ్యమంటారు?"

"ఏం చెయ్యాలో నీకు తెలియని విషయం కాదు. ఇంకొకరిచేత చెప్పించుకోవలసింది కాదు."

"తెలియక కాదు చేసింది. ఎందుకు చేశానో మీకు తెలీదు."

"ఇంకా నెలయినా నిండని పసి గుడ్డు ప్రాణం మీద కొచ్చేవని తెలిసే చేశావా?"

"ఇలా అవుతుందని అనుకో లేదు."

"పోనీ అయిందేదో అయింది. ఇకనయినా జాగ్రత్తగా వుండు."

"లోకంలో ఎంతో మంది కంటున్నారు. సగానికి పైగా పిల్ల లకి తల్లి పాలు లేవు."

"లేనివాడి ఖర్మ ఉన్నవాడికి కూడా పట్టాలంటావు!"

"ఖర్మ ఏముంది? పోతపాలు పోసే వాళ్ళు ఏమీ అయిపోడం లేదు."

"అవును వసంతా! లేని వాళ్ళు ఏదో చేస్తున్నారని నువ్వూ...."

"మీకెలా చెప్పను? తొలి కాను పయ్యాక అందం పెరుగుతుంది. కాని పాలు తాగడం మొదలెడితే శక్తి అంతా ఉడిగిపోయి ఇరవై ఏళ్ళకే అరవై ఏళ్ళ మనిషి నవుతాను."

"వసంతా! ఇది అజ్ఞానం సుమా! తనకి తాను ఆహారం తిన గలిగే వయసు వచ్చేవరకూ అన్ని ప్రాణులకీ ఆహారం సిద్ధమయే వుంటుంది. కోడిపిల్లకి గుడ్డులోనూ-మొక్కకి విత్తనంలోనూ-పిల్లకి తల్లి రొమ్ములోనూను. పాలివ్వ డంలో తియ్యటి అనుభూతి స్త్రీకి సృష్టి ప్రసాదించిన వరం. ఇందు వల్ల కానుపు ఎడం అవుతుంది కూడా! అందం-ఆకర్షణ మీద అంత వ్యామోహం మంచిదికాదు."

"నేనో మాట చెప్పనా?" అంతా విని అంది వసంత.

"అంటే నేను చెప్పింది నీకు తలకెక్క లేదన్న మాట!"

"వినకుండానే!"

"నా మాట వినాలనుకుంటే ఇంకేం చెప్పే అవసరం వుండదు."

"ముందు చెప్పేది వినండి!"

"చెప్పు!"

"పోతపాలు పడడంలేదు. తల్లి పాలు ఇవ్వాలంటే నే నివ్వక్కర లేకుండా...."

"ఎవరి చేతనయినా యిప్పి స్తావా?"

"ఎవరయినా వుంటే కనుక్కో మని రేపు ముత్యాలుకి చెప్తాను."

"అలా ఎవరూ యివ్వరు. కన్న తల్లికే పట్టనప్పుడు ఎవరు మాత్రం ఎందుకిస్తారు?"

"దబ్బిద్దాం!"

"దబ్బుకి పాలమ్ముకుంటారా?"

"అమ్ముకోడం అవి ఎందు కమకోవాలి? ఆ ఒకంగా మనకి ఉప కారం చేసి దబ్బు తీసుకుంటుంది."

"నీ యిష్టం. కన్న కొడుకు ప్రాణాలతో చెలగాటం నా కిష్టం లేదు."

వసంతలక్ష్మి గొంతు మార్చింది- "ఏమిటి ఇష్టం లేదు? కన్నకొడుకు- కన్నకొడుకంటున్నారు- మీకేనా కన్నకొడుకు? నాకు కాదా? మహా కనే సేరు కొడుకువి? తొమ్మిదినెలలు నేను మోసేను. నా రక్తం-మాంసం పేగులో భాగంగా పెరిగాడు— ప్రాణాలు పణంగా పెట్టి నెప్పులు పడి కన్నాను. నాకు తెలీదా బాధ్యత? ఎదుటి మనిషిని అర్థం చేసుకోడం- ఆలోచించుకోడం లేదు."

లైటు ఆర్పి వెళ్ళిపోయింది.

బాబూరావు వసంతల ఏ చర్చ కయినా ముగింపు యిదే. అందు చేతనే అసలు బాబూరావు ఈ విషయం చర్చించ దలచుకోలేదు. కాని తప్పలేదు.

వసంతలక్ష్మి దబ్బుగల యింట పుట్టింది. చిన్నతనంలోనే తల్లిని పోగొట్టుకుంది. కనక గారాబంగా పెరిగింది. బాగా చదువుకున్నవాడు కనక—ఏమీ లేకపోయినా బాబూరావుని కట్టుకుంది వసంత.

ఒక్కో మనిషి అందం ఒక్కో విధంగా వుంటుంది. అందక త్తె లందరి అందమూ కూడా రక రకాలుగా వుంటుంది.

వసంతలక్ష్మి అందాన్ని పూర్వ కవుల్లా ఏ అవయవానికి ఆ అవ యవం విడివిడిగా వర్ణించి చెప్తే కుదరదు. మొహం సామాన్యం గానూ-శిల్పం సమ్మోహనంగానూ వుంటుంది. ఆవిడ అందంమీద ఆవిడకి ఓవర్ ఎస్టిమేషను. బాబూరావుది అండర్ ఎస్టిమేషను.

తెల్లవారింది. తన పట్టుదల విలబడుతుందా అన్న భయం— మొగుడు తన ఆలోచనతో కలిసి రాలేదన్న కోపం—వెరసి పసుపూ సున్నం కలిపి కాటుక పెట్టినట్లు న్నాయి వసంత కళ్ళు. వేళకి బాబూ రావు ఆఫీసుకి వెళ్ళి పోయాడు.

పరిష్కారం కాని సమస్య పుట్టదు. మనం కనిపెట్టడంలో వుంటుంది. ముత్యాలు పనిచేసేసి యింటికి వెళ్ళిపోతూండగా వసంత పిలిచింది.

"ఇదిగో కాఫీ తాగు!"— కొంచెం ఆశ్చర్యపడి గ్లాసు అందు కుంది.

"కూర్చో"—అ న గా నే, "చెప్పండి అమ్మగారూ!" గ్లాసు

పూదుకుంటూ కూర్చుంటూండగా-మనసులో ఆశ్చర్యంవల్ల గ్లాసు తొణికి ఓ చుక్క ఒంటిమీద పడి చుర్రుమంది. చేత్తో అక్కడ రాసుకుంటూ కూర్చుని కాఫీ తాగుతూ అమ్మగారికేసి చూసింది చెప్పమని.

"నాకో వుపకారం చేసి పెట్టాలే!" పెద్ద స్థాయిలో మనిషి చిన్న స్థాయిలో మనిషిని ఇలా అడిగితే ఎక్కడయినా ఒక్కటే జరుగుతుంది. అదే యిక్కడా జరిగింది. ముత్యాలు ఉబ్బిపోయింది.

"మా అబ్బాయికి పోతపాలు పడడం లేదే!"

"బిడ్డ పుట్టి—పాలు పడలేదా అమ్మగారూ?" నవ్వుతూ అడిగింది ముత్యాలు.

బాబూరావుతో నిజంచెప్పి భంగపడింది. దీనికి కూడా ఆ నిజమే చెప్తే సానుభూతి వుండదు. 'ఇదేం బుద్ధి అమ్మా! నువ్వేం గొడ్డువా, మనిషివా?' అంటుంది. పిల్ల పుట్టాక కూడా భార్యలో బిగువు తగ్గకపోతే ఆనందంపొందే మొగుడే తన పనిని మెచ్చుకోలేదు. "నా కర్మ—ఏం చెప్పనే! పాలుంటే మాత్రం ఏం లాభం? అదేం పాపమో—రెండోసారి నోట్లో పెట్టుకోలేదు. చేదు పడిపోయాయి. అప్పట్నుంచీ పోతపాలే. అవి పడడంలేదు. నాలుగు రోజుల్నుంచి వాంతులూ విరోచనాలూను."

"మరేంచేద్దాం అమ్మగారూ!" వసంత అనుకున్నట్లుగానే ముత్యాలులో సీరియస్‌నెస్ కనిపించింది.

మళ్ళీ ముత్యాలే అంది చాలా ఎపోలజిటిక్‌గా —"ఉన్నమాట చెప్పకపోదవేంవండి. మా అత రోడికి ఆరేళ్లల్లి ఏదో ఏదు వచ్చింది. నా కాదున్నా మీకీ బాధ లేకపోవును."

"ఛ—నిన్నిమ్మనలేదే" అంది కాని తను అడక్కుండానే తనకి కావలసిన ప్రశ్నకి సమాధానం వచ్చేసింది: "మీ పేటలో ఎవరయినా ఉన్నారేమో చూసిపెట్టు. ఊరకే వద్దులే-నెలకి 50 రూపాయలిస్తాను. మూడు నెలలు చాలు."

"అడుగుతా నమ్మగారూ! నాకు వరసకి మేనత్త అవుద్ది. దూరపు సుట్టం. ఓ నెలయి పురుడు పోసుకుంది. డబ్బుకోసం కటకటలాడుతున్నారు."

"అయితే చెప్పు. ఈ వేళనుంచే రమ్మను. మరి పిల్లాడికి రోజులు గడిచేకొద్దీ కష్టమేకదా!"

ముత్యాలు వెళ్ళిపోయింది. పని సగం అయినట్లేనని తృప్తితోనూ-

పూర్తిగా అవుతుందన్న నమ్మకం తోనూ వసంత కొంచెం తేలిగ్గా గాలి పీల్చింది.

* * *

ముత్యాలుకి దూరపు చుట్టం-వరసకి మేనత్త రత్తమ్మ వురఫ్ వెంకటరత్నం ఆరో కొడుకుని కన్నది. ఈ రత్తమ్మ పీరాస్వామి ఇంటిది కాబట్టే-కన్నది ఆరోసారి కాబట్టే పెద్ద అట్టహాసం లేదు. ఇప్పుడు వాళ్ళకి ఆరుగురు పిల్లలు-అంతే! ఓ నెలయింది.

పీరాస్వామి నిష్కామ యోగి వంటివాడు. 'నీ ప్రయత్నం నువ్వు చెయ్యి-ఫలితంతో నీకు సంబంధం లేదు' అనే గీతా వాక్యము త్రికరణ శుద్ధిగా నమ్ముతాడతను. భార్య అంటే అతనికి ప్రేమే. ఎందుకంటే ఆమెకి ఆరుగురు పిల్లలతో బాటు తనూను. వేళకి భోజనం-వేళ అయ్యేసరికి మందుకి రెండు రూపాయలూ ఇచ్చేస్తుంది. ఆమె నాలుగిళ్ళల్లో పాచి పని చేస్తుంది. పదేళ్ళు-పన్నెండేళ్ళు వున్న పెద్ద కొడుకులిద్దరూ పేడకళ్ళు ఎత్తుతారు. పిడకలుచేసి అమ్ముతుంది. ఎదుటి మనిషి మనకి కావలసి నట్టుగా వ్యవహరిస్తున్నంతవరకూ-మనం చెప్పినదల్లా అవునవేంత వరకూ-అంత మంచి మనిషి మరొకడుండడు. పొరపాటున ఒకసారి తప్పిందో-ఆ వ్యక్తి గురించి మన ఊహలోనూ భాష లోనూ మార్పు వస్తుంది.

మధ్యాహ్నం భోజనాలయి రత్తమ్మా, పీరాస్వామి వూసు లాడుకుంటున్నారు. రత్తమ్మకి లోకం భయం ఎక్కువ. రత్తమ్మే ఇంటిపీ - మొగుణ్ణి పోషిస్తోంది అన్నమాట! పగలు మొగాడి పని, రాత్రి ఆడదాని పనీ కూడా ఆమె బాధ్యతలే అని వాడుక పడి పోయింది.

పీరాస్వామి అలాంటి పబ్లిక్ అభిప్రాయాలు పట్టించుకోడు. ఎందుకంటే - తనని ఎవరయినా తిడితే ఆ తిట్లు ఆత్మకి తగలవు. ఆత్మ నిర్వికారమయినది. శరీరానికి తగిలినా నష్టంలేదు. అది ఎలాగూ నశించిపోయేదే కదా! అయినా నాలుగు మంచి మాటలు చెప్పి అతనిచేత పూచికపుల్లంత పని యినా చేయించి రోజుకి ఒక రూపాయి అయినా సంపాయించేట్టు విడవకుండా ప్రయత్నం చేస్తోంది. పీరయ్య జారిపోతూనే ఉన్నాడు.

"లాభం లేదే రత్తీ! ఈ ఒల్లు పనికి పన్జెయ్యదు."

"ఏవంటా!" కొమ్ము దువ్వే

వతో అతని వీపుమీద చీద పొక్కుల్ని గోకుతోంది.

"పిన్నప్పట్నించీ ఎప్పుడయినా పనిసేసి ఎరుగుదునేంటి?"

"మరి సిన్నప్పట్నించీ పిల్లల్ని కని ఎరుగుదునేటి?"

"ఏటా రౌడీ ఏసాలు?" పైకి ఇలా అన్నా పెళ్ళాంచేత అటు వంటి మాటలనిపించడం వీరా స్వామికో అలవాటైన ముచ్చట-ముచ్చటైన అలవాటు.

"ఎందుకే అలవాటు లేని పన్లు సెయ్యడం? ఇలా పోనిద్దూ!"

"ఏటిలా పోనిద్దూ!" అని దువ్వె నతో గట్టిగా పొడిచింది.

"నెమ్మది - నెమ్మది. అదేటి అంత గట్టిగా గోకేత్తావు-దువ్వెన ఇరిగిపోద్ది"

"సాల్లే సరసం—కూకుని తిం టుంటే ఎల్లకాలం సాగుద్దేటి?"

"ఓసి ఎర్రిమొకమా! సాగే వోడికి ఎప్పుడూ సాగుద్ది. సాగ నోడికి ఎప్పుడూ సాగదు. సిన్న ప్పుడు కోయదొర నా మొకం సూసి సెప్పేడు - నా కెప్పుడూ తిండికి లోటుండదనీ, కూకుంటే లెగకర్లేదనీను." మహాగర్వంగా చెప్పేడు గారపళ్ళికిలిస్తూ.

"అహా! లెగితే పడిపోతావని సెప్పలేదేటి?" మళ్ళీ పొడిచింది.

"అ....హ....హా!" మనసారా నవ్వుకున్నాడు పెళ్ళాం పెన్స్ ఆఫ్ హ్యామర్‌కి.

"పోనీ నీకు పని సెయ్యడం కట్టం అయితే ఏదయినా సిన్న వ్యాపారం సెయ్యి."

"మల్లా అదెందుకే? దానికి పెట్టు బడుండాల- ఓ మనిషి ఎప్పుడూ కనిపెట్టుకుండాల."

"నవ్వేంది. మరి కూకుంటే లెగక్కర లేదులే—కోయ దొర మాట పోతుందని బెంగెట్టు కోకు! మన పేటలో వాళ్ళందరూ సిన్న అగ్గిపెట్టి కావాలన్నా మైలు దూరం నడిసి ఊర్లో ఎంకట్రావు కొట్టుకెళ్తారు. అగ్గిపెట్లు-బీడీలు-సిగ రెట్లు-టీ కట్టలూ పెడదాం. నెమ్మది మీద ఓ సిన్న టీ దుకానం కూడా ఎట్టుకోవచ్చు పెట్టుబడి జతపడితే!"

"మరి పెట్టుబడీ?"

"నా కాడో వంద రూపాయ లున్నాయి. నెమ్మదిగా డబ్బు దొరికి నప్పుడల్లా పెట్టుబడికి జతసేసు కుంటూండొచ్చు. నువ్వు రోజుకో అద్దురూపాయ సంపాయించ వయ్యా-నాకు సాలు."

"సూద్దాంలే." మూలిగాడు. ఓ చోట కూర్చోడం అన్నా చాల కష్టమే పాపం అతనికి.

"సూద్దాంవంటే కాదు. నేనో

మాట సెప్తా విను-ఇప్పుడే మా ముత్తెం ఒచ్చి సెప్పి ఎల్లింది." అంతా వివరంగా చెప్పింది రత్తమ్మ.

"ఓసెర్రి మొకవా! ఒప్పేసుకున్నావేటి?" మతిపోయింది వీరాస్వామికి.

"నీకో సెప్పి ఒప్పుకుందాంవనుకున్నాను."

"ఒద్దు."

"ఏం?"

"మన పిల్లోడికేంవిత్తావు?"

"ఆ పిల్లోడి కయ్యాక యీడు తాగుతాడు."

"ఈడికేంవన్నా మిగలాలా?" మిగలదనే అతని అభిప్రాయం.

"మిగలక పోతే గేదె పాలు పోద్దాం. మన పిల్లలకేటయ్యా! ఏమి పోసినా అరిగి పోతాయి. గొప్పోళ్ల పిల్లలకే రకరకాల బాధలూ—రోగాలూను. ఆలకి దోమ కుడితే రోగం. మురిక్కాలవ పక్కన మనం, దోమలూ కలిసే బతుకుతున్నాం. నీకెందుకు నువ్వు ఊం అను. నెలకి ఏభై రూపాయలిత్తారు. ఆ పిల్లోడికి ఆరోనెలొచ్చేటప్పటికి నీకు మూడొందల రూపాయలిత్తాను."

"సరే—నీ యిష్టం." అతనికి నిజంగా యిష్టం లేకపోయినా ఔనని పించే శక్తి ఆ మూడొందల రూపాయలలోనూ—రత్తమ్మ ఆడతనంలోనూ వుంది.

వసంత కొడుకుకి—రత్తమ్మకీ, కృష్ణుడు—పూతన పోలిక తెస్తే రత్తమ్మని అవమాన పరిచినట్లే! ఆఖరు చుక్కవరకూ తాగేసి మాత్రమే నిద్రపోతాడా బాలుడు. నిద్రపోయిన కొడుకు మొహం తృప్తిగా చూసి రత్తమ్మని చిరునవ్వుతో సాగనంపుతుంది వసంత. రత్తమ్మ వెళ్ళిపోయాక కొంచెం ఉప్పూ, మిరపకాయలూ దిగదుడిచి పారేస్తుంది. వారం పది రోజులయ్యాక-తన దగ్గరవాడగా మిగిలిపోయిన పాల డబ్బా ఒకటి రత్తమ్మ కిచ్చింది—వాళ్ళబ్బాయికుపయోగపడుతుందని.

కుదుపు లేని ప్రయాణంలో కదలిక తెలియదు. అన్నీ ముందు మనం అనుకున్నట్లుగా మనమే చెయ్యం. కాలం మాత్రం ఎందుకు చేస్తుంది?

ఓ నాడు రాత్రి భోజనాలయ్యాక బాబూరావు పడక గదిలో పడుంవాల్చాడు. ఇంట్లో తలుపులన్నీ వేసేసి లైట్లు ఆర్పి—ఆ వెలుగు అంతా తనలో నింపుకుని పడక గదిలో ప్రవేశించింది వసంత. ఆ మెత్తటి పవ్వడికి తల తిప్పి

చూశాడు బాబూరావు. మల్లెపూలు, తెల్ల చీరతో పూల రథంలా పక్కన చేరింది వసంత!

తన కేదయినా కావలసి వచ్చి నప్పుడు ఇలా ఆదరతనాన్ని, అందాన్ని-ఎరగా వాడడం వేశ్యా లక్షణం అంటారు కాని అది స్త్రీ సహజమైన లక్షణం అనాలి.

ఇప్పుడు వసంత బాబూరావుకి చెప్పి ఒప్పించవలసింది ఏమీ లేదు కాని—చెప్పవలసింది వుంది. చెప్పేక బాబూరావు మూడ్సు మారకూడదని ఈ తాపత్రయం.

"ర త్తమ్మ కొడుకు పోయాట్ట!" నెమ్మదిగా అంది అతని గుండెల మీద వెంట్రుకలు సవరిస్తూ.

"అరె! ఎప్పుడూ!" ఆమె చెయ్యి విదిలించి అడిగేడు.

"ఈ వేళే-సాయంత్రం ఇక్క ణ్నుంచి వెళ్ళేక!" చెయ్యి విది లించినందుకు అభిమానాన్ని నిగ్ర హించుకుని చెప్పింది. అతనికి నెమ్మదిగా అర్థం అవుతోంది. ఆలోచిస్తున్నాడు.

"నిన్నా ఈ వేళా వాంతులూ విరోచనాలూ అయ్యాయట— సాయంత్రానికి పోయాట్ట!"

"ఏమిటాలోచిస్తున్నారు?"

"మన పిల్లాడికి వాంతులయితే డాక్టర్ దగ్గరకి తీసికెళ్ళాం. ర త్తమ్మ తీసుకెళ్ళలేకపోయింది. ఆ వాంతులు ఎందుకవుతున్నాయో-ఏం యిస్తే పోతాయో తెలుసుకుని దాన్ని మనం డబ్బుతో సమ కూర్చుకున్నాం. ఏం లేకపోతే వాంతులవుతాయో రత్తమ్మ తెలుసు కోక దాన్ని మనకి అమ్మేసి తన కొడుక్కి లేకుండా చేసుకుని-చివరకి కొడుకే లేకుండా చేసు కుంది."

"అంటే-దానికి నేనే కారణం అంటారా?" చాలా గిల్టీగా ఫీల వుతూ అడిగింది.

"నీ అందం—ఆకర్షణ చెడి పోతాయని నీ కొడుక్కి పాలివ్వ లేక దాన్ని పురమాయించిన నువ్వూ-నీ మూర్ఖత్వాని అదమాయించి ఆ ప్రయత్నాన్నుంచి నిన్ను మాన్పించలేక పోయిన నా అస మర్థత-నెలకి యాభై రూపాయలకి ఆశపడిన ర త్తమ్మ పేరాశ, పేద రికం—పీటన్నింటినీ మించి యాభై రూపాయల కోసం తన కొడుక్కి ఏం లేకుండా చేస్తోందో ర త్తమ్మకి తెలియకపోడం—దాని కొడుకు దౌర్భాగ్యం-ఇవన్నీ వాడి చావుకి కారణాలు."

"రేపొస్తుందంటారా?" అసలు విషయానికి వస్తూ అడిగింది.

"ఏమో! వస్తే రావచ్చు—

కొడుకు చచ్చిపోయాడు కదా—అడ్డేముంది!"

"రేపు దాన్ని మాన్పించెయ్యండి!" అర్థంకాక ఆమె కళ్ళల్లోకి చూశాడు.

"ఎవరికయినా బిడ్డపోతే—ఆ వయసువాళ్ళు ఎవరు కనబడినా కొడుకు జ్ఞాపకం వచ్చి మనసు కలత చెందుతుంది. ఆ దృష్టి మంచిది కాదు. అలాంటిది తన కొడుకు చచ్చిపోయి—ఆ వయసు వాడు-మన పిల్లాడికి పాలివ్వడం మన బాబుకి మంచిదికాదు." ఇదంతా విని బాబూరావు ఆశ్చర్యపోయాడు. ఆడది ఇంత ఫాస్టుగా ఆలోచిస్తుందన్నమాట!

బాబూరావుకి విజమే ననిపించింది. ఆమె చెప్పింది తన కొడుకు గురించే కదా! మర్నాడు ఉదయం మామూలుగా రత్తమ్మ వస్తూంటే-అంత దూరాన్నే చూసి కొడుకుని తీసుకుని హాల్లోంచి లోపలి గదిలోకి వెళ్ళిపోయింది వసంతలక్ష్మి. హాల్లో సోఫాలో కూర్చున్నాడు బాబూరావు. అతన్ని చూసి రత్తమ్మ ఆగిపోయింది. ఆ కళ్ళల్లోంచి నీళ్ళు చిమ్ముతున్నాయి.

"ఏం రత్తమ్మా!—అబ్బాయి పోయాట్ట!" వసంత లోపల గదిలో వుండి కిటికీలోంచి చూస్తోంది. "పోయాడండి!" అనబోయింది. దుఃఖం దిగమింగేలోగా మాట పైకి వస్తూండగా కంఠంలో రెండూ ముడిపడిపోయాయి. మాట పైకి వినబడలేదు.

"చూడు రత్తమ్మా! నీ కొడుకు పోయిన దుఃఖం నీకు తీరేది కాదు. నువ్వు మాకు చేసిన ఉపకారం మరిచిపోలేనిది. ఆ ఋణం నెలకి ఏభై రూపాయలతో తీరేది కాదు. ఇంకా నీకు శ్రమనిచ్చి నిన్ను బాధపెట్టడం నాకు భావ్యంగా తోచడం లేదు. ఇది వుంచుకో!" వంద కాగితం చాపాడు. "తీసుకో రత్తమ్మా!—నా తృప్తి కోసం తీసుకో!"

మౌనంగా రత్తమ్మ వంద నోటు అందుకుంది. తల ఎత్తింది. బాబూరావు తలదించుకున్నాడు. రత్తమ్మ గొంతు విడలేదు. ఆ గొంతు ఎక్కడ వినబడుతుందో-విని తన కొడుకు ఎక్కడ ఏడుస్తాడో అని వసంత కొడుకు నోట్లో పాలతిత్తి పెడుతున్న దృశ్యం-లోపల గదిలో వెలుతురు తక్కువగా వుండడం వల్లనో-రత్తమ్మ కళ్ళల్లో నీళ్ళు నిండడంవల్లనో కిటికీలోంచి ఆమెకు సరిగ్గా కనబడలేదు. •